# సెబీ చైర్‌పర్సన్‌పై చర్యలు తీసుకోవడంలో నిర్మలా సీతారామన్ విఫలం

- స్కాంలో భాగమైన బచ్ .. 'అదానీ'పై ఎలా దర్యాప్తు చేస్తారు
- స్టాక్ మార్కెట్‌పై 11 మంది ఆధారపడ్డారు
- అందులో మధ్యతరగతి ప్రజలే ఎక్కువ
- వారిని రక్షించాల్సిన బాధ్యత సెబీదే
- అదానీ వ్యవహారమంతటిపై జెపిసి దర్యాప్తు
- లోక్‌సభలో కాంగ్రెస్ డిమాండ్



**న్యూఢిల్లీ :** సెబీ చైర్‌పర్సన్ మాధబి బచ్ మీద పరస్పర విరుద్ధ ప్రయోజనాల ఆరోపణలపై కఠిన చర్యలు తీసుకోవడంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ విఫలమయ్యారని కాంగ్రెస్ ఎంపి కె.సి.వేణుగోపాల్ విమర్శించింది. ఈ వ్యవహారంలో ప్రభుత్వ విశ్వసనీయతను దెబ్బతీసేదమే కాకుండా ఆర్థిక పాలన వ్యవస్థను కూడా ప్రమాదంలో పడేసినట్లయిందని పేర్కొంది. స్టాక్ అవకతవకల్లో అదాని గ్రూప్ పేరు ఉందని, ఆ కుంభకోణంలో బచ్ భాగమైనప్పుడు ఆమె ఎలా దర్యాప్తు చేయగలరని ప్రశ్నించారు. మొత్తం వ్యవహారంపై జెపిసి విచారణ ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. లోక్‌సభలో సోమవారం నాడు అనుబంధ పద్దులపై జరిగిన చర్చ సందర్భంగా అదానీ అంశాన్ని కాంగ్రెస్ ఎంపి కె.సి.వేణుగోపాల్ లేవనెత్తారు. దేశంలో, 11 కోట్ల మంది ప్రజలు స్టాక్ మార్కెట్లపై ఆధారపడి ఉన్నారని, వారిలో ఎక్కువ మంది మధ్యతరగతి వర్గాలకు చెందినవారని ఆయన అన్నారు. భారతీయ మధ్య తరగతి ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బును రక్షించే బాధ్యత సెబీకి ఉందని ఆయన అన్నారు. సెబీలో ఏదైనా లోపం లేదా తప్పు జరిగితే అది ప్రభుత్వంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందన్నారు. నిష్పక్షపాతమైన సమగ్రత, నైతిక ప్రమాణాలు కలిగిన వ్యక్తులను ఇలాంటి కీలకమైన నియంత్రణ సంస్థలకు నియమించేలా చూసుకోవడం ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రత్యక్ష బాధ్యత అని వేణుగోపాల్ అన్నారు. సెబీ చైర్‌పర్సన్‌పై అనేక తీవ్రమైన ఆరోపణలు వెలువడ్డాయని, అవి నైతిక , నియంత్రణ ప్రమాణాలను తీవ్ర ఉల్లంఘనలకు సంబంధించినవని ఆయన అన్నారు. ఇంతటి కీలక అంశంపై మాట్లాడుతున్న సమయంలో కేంద్ర ఆర్థిక మంత్రి సభలో లేకపోవడాన్ని ఆయన ప్రశ్నించారు.

**ఇది అదానీ ప్రభుత్వం**

ఇది 'అదానీ ద్వారా, అదానీ కోసం , అదానీ యొక్క ప్రభుత్వం' అని కె.సి.వేణుగోపాల్ ఆరోపించారు. 2017–2024 మధ్య బచ్ సెబీ అధికారిగా పనిచేస్తూ ఐసిఐసిఐ బ్యాంకు నుండి రూ.16.4 కోట్లకు పైగా అందుకున్నారని వేణుగోపాల్ అన్నారు.'ఇది ఆమె సెబీ నుండి వచ్చిన జీతం కంటే ఐదు రెట్లు ఎక్కువ, ఇది స్పష్టమైన విరుద్ధమైన ప్రయోజనాలను రుజువు చేస్తుందని' ఆయన అన్నారు. సెబీ దర్యాప్తులో ఉన్న సంస్థకు సంబంధిత సంస్థల నుండి ఆమె అద్దె ఆదాయాన్ని పొందిందని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పిఎసి) చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్న వేణుగోపాల్ ఆరోపించారు. ప్రచురించని కీలకమైన సమాచారాన్ని కలిగి ఉండే సెబీ చైర్‌పర్సన్ రూ. 36.9 కోట్ల విలువైన సెక్యూరిటీలలో వ్యాపారం చేశారని, ఇది సెబీ నీతి నియమావళిని ప్రత్యక్షంగా ఉల్లంఘించడమేనని విమర్శించారు. 2017–21 మధ్య సింగపూర్, అమెరికాలో ఆస్తులను బహిర్గతం చేయాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ ఆమె విఫలమయ్యారని వేణుగోపాల్ అన్నారు. ఈ ఆరోపణలు ఉన్నప్పటికీ ఆర్థిక మంత్రి స్వతంత్ర విచారణను ప్రారంభించడం లేదా ఎటువంటి క్రమశిక్షణా చర్య తీసుకోవడం లేదని తెలిపారు. సెబీ చైర్‌పర్సన్ సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో దేశీయ, విదేశీ పెట్టుబడిదారుల విశ్వాసం దెబ్బతినడాన్ని ఆర్థిక మంత్రి గమనించడం, గుర్తించడం లేదా, ఇందుకు బాధ్యత తీసుకోవడం లేదా? అని వేణుగోపాల్ నిలదీశారు. ఇలాంటి పరిస్థితులలో సెబీ చైర్‌పర్సన్‌ను కొనసాగించడం ద్వారా కార్పొరేట్ గవర్నెన్స్, నియంత్రణ, పారదర్శకత పట్ల భారత దేశ నిబద్ధతకు తప్పుడు సంకేతాన్ని పంపుతుందని మంత్రిత్వ శాఖ విస్మరిస్తుందా? అని ఆయన అన్నారు. ప్రభుత్వం ఎందుకు ఎలాంటి చర్య తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు.

## ఆర్థిక మంత్రితో వివాదంతోనే
# ఆర్‌బిఐని వీడిన శక్తికాంత్ దాస్

ఆర్థిక సంక్షోభ పరిష్కారానికి మన్మోహన్ సింగ్ కావాలి

అనుబంధ పద్దులపై చర్చలో టిఎంసి ఎంపి సౌగత రాయ్





**న్యూఢిల్లీ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో 5.4 శాతం తక్కువ ఆర్థిక వృద్ధి రేటును నమోదు కావటాన్ని ప్రతిపక్ష సభ్యులు సోమవారం నాడు ఎత్తి చూపారు. వృద్ధిని పెంచేందుకు, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు, ఉద్యోగాలను సృష్టించేందుకు ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని కేంద్ర ఆర్థిక మంత్రిని డిమాండ్ చేశారు. లోక్‌సభలో అనుబంధ పద్దులపై జరిగిన చర్చలో పాల్గొన్న టిఎంసి సభ్యులు సౌగత రాయ్ మాట్లాడుతూ వృద్ధిని పెంచాలా లేదా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలా అనే చిన్న కదలికలో ప్రభుత్వం చిక్కుకుందని, ఆర్థిక వ్యవస్థ సరైన స్థితిలో లేదని అన్నారు.'ఆర్థిక వ్యవస్థలో ఒక సాధారణ సంక్షోభం నెలకొందని, సంక్షోభం అంటే రెండవ త్రైమాసికం కోసం మన వృద్ధి అంచనా 5.4 శాతానికి పడిపోయిందని, ఇది ఆర్థిక వ్యవస్థకు చాలా హానికరమని, తయారీ రంగంలో తీవ్ర మందగమనంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీ రేటును తగ్గించాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన డిమాండ్‌ను ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ పట్టించుకోలేదని, దానికి బదులుగా ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడంపై దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నారని, చివరకు ఆయన రిజర్వ్ బ్యాంక్ నుంచి వెళ్ళిపోవాల్సి వచ్చిందని ఆయన ఆరోపించారు. 'ఆర్థిక మంత్రి , ఆర్‌బిఐ గవర్నర్ మధ్య వివాదం జరిగింది. రిజర్వ్ బ్యాంక్ రెపో రేటును స్థిరంగా ఉంచాలని కోరుకుంది. అయితే ఆర్థిక మంత్రి దానిని తగ్గించాలని, తద్వారా ఆర్థిక వ్యవస్థకు ఎక్కువ డబ్బు సమకూరుతుందనిఒత్తిడి చేసారు. చివరికి, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ వెళ్లిపోవాల్సి వచ్చింది' అని రే అన్నారు. గ్రాంట్ల కోసం అనుబంధ డిమాండ్‌ల ద్వారా గ్రాండ్ కోసం మొదటి బ్యాచ్ ద్వారా ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 44,143 కోట్ల అదనపు నికర వ్యయం కోసం లోక్‌సభ అనుమతి కోరింది. ప్రధానంగా వ్యవసాయం, ఎరువులు, రక్షణ మంత్రిత్వ శాఖల ఖర్చు పెరగడంతో అనుబంధ పద్దులను ప్రతిపాదించింది. ఈ అనుబంధ డిమాండ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 4.9 శాతం లక్ష్యం నుండి ద్రవ్యలోటును పెంచుతుందని,దానిని ఎదుర్కోవడానికి ఏకైక మార్గం మౌలిక సదుపాయాలపై ఖర్చును తగ్గించడమే అని రే అన్నారు. 'అధిక వృద్ధిని కొనసాగించడానికి మీకు మరిన్ని ప్రైవేట్ పెట్టుబడులు అవసరం. మరిన్ని ప్రైవేట్ పెట్టుబడులు ఉండాలంటే, మీరు మౌలిక సదుపాయాలపై ఎక్కువ ఖర్చు చేయాలి. మీరు మౌలిక సదుపాయాలపై ఎక్కువ ఖర్చు చేస్తే, ద్రవ్యోల్బణం పెరుగుతుంది. కాబట్టి ప్రభుత్వం రెండువైపుల దెబ్బలో చిక్కుకుంది' అని రే అన్నారు.భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించగల సామర్థ్యం కలిగిన వారిని ఎన్‌డిఎ ప్రభుత్వంలో తాను చూడలేదని రే అన్నారు. 'ఈ సమస్యను పరిష్కరించడానికి మన్మోహన్ సింగ్ అవసరం... ఈ ప్రభుత్వం విధానాలు లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతోంది. 'ఆమె (సీతారామన్) విదేశీ డిగ్రీ లేకపోవడం గురించి నేను ఇంతకుముందు వ్యాఖ్యానించాను. నేను ఆ వ్యాఖ్యను ఉపసంహరించుకుంటున్నాను. కానీ ఆర్థిక మంత్రి భారతీయ విశ్వవిద్యాలయం నుండి కూడా ఆర్థిక శాస్త్రంలో పిహెచ్‌డి చేసి ఉంటే బాగుండేది. అలాగైతే భారత ఆర్థిక వ్యవస్థ చిక్కుకున్న సమస్యను వృద్ధి లేదా ద్రవ్యోల్బణ నియంత్రణను ఆమె పరిష్కరించగలిగేవారు'అని ఆయన అన్నారు. ఎన్‌సిపి(ఎస్‌పి) సభ్యురాలు సుప్రియా సులే చర్చలో పాల్గొంటూ ముఖ్యంగా ఉద్యోగ సృష్టి, ద్రవ్యోల్బణం, పెరుగుతున్న దేశీయ వినియోగం, రెండవ త్రైమాసికంలో ఆందోళన కలిగిస్తున్న 5.4 శాతం జిడిపి వృద్ధిని పరిష్కరించడానికి ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటుందో ఆర్థిక మంత్రి తెలియజేయాలని కోరారు. ఇటీవలి నెలల్లో తగ్గుతున్న ఎగుమతులను పెంచడానికి చర్యలు తీసుకోవాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ మూలధన వ్యయం ఆధారంగా ఆర్థిక వ్యవస్థ నడుస్తోందని మనీష్ తివారీ (కాంగ్రెస్) అన్నారు.యూపీఏ పాలనతో పోలిస్తే మోడీ పాలనలో అన్ని ఆర్థిక పారామితులు క్షీణించాయని డేటాను ఉటంకిస్తూ ఆయన అన్నారు.

# మైనారిటీలపై అకృత్యాలను బంగ్లాదేశ్‌తో చర్చించాలి

**వారికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలబడాలి : ప్రియాంకాగాంధీ**

**న్యూఢిల్లీ :** బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతున్న అకృత్యాలను ప్రభుత్వం పొరుగు దేశం వద్ద లేవనెత్తాలని కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ సోమవారం లోక్‌సభలో అన్నారు. జీరో అవర్‌లో ఆమె మాట్లాడుతూ దాడుల కారణంగా బాధలో ఉన్నవారికి ప్రభుత్వం అండగా నిలబడాలని కోరారు. 'బంగ్లాదేశ్‌లో మైనారిటీలు, హిందువులు, క్రైస్తవులపై జరుగుతున్న అఘాయిత్యాల సమస్యను ప్రభుత్వం లేవనెత్తాలి. దీనిపై బంగ్లాదేశ్ ప్రభుత్వంతో చర్చించి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అండగా నిలబడాలి' అని ఆమె అన్నారు.

**పాక్ లొంగుబాటు ఫోటోను తొలగించడమేంటి?**

భారత్ ముందు పాకిస్థాన్ లొంగిపోతున్న ఫొటోను ఆర్మీ హెడ్ క్వార్టర్స్‌లో ఎలా తొలగిస్తారని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. సోమవారం విజయ్ దివస్ జరుపుతున్న వేళ ఫొటో తొలగించడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. 1971లో భారత్–పాకిస్థాన్‌ల మధ్య జరిగిన యుద్ధంలో సైనికులు, అమరవీరుల పాత్రను వయనాడ్ ఎంపీ గుర్తు చేసుకున్నారు. 1971 యుద్ధంలో పాకిస్థాన్‌పై భారత్ సాధించిన విజయానికి గుర్తుగా ప్రతి సంవత్సరం డిసెంబర్ 16న విజయ్ దివస్ జరుపుకుంటారు. ఈ యుద్ధం బంగ్లాదేశ్ విముక్తికి కూడా దారితీసింది.

**పరిహారం పెంచుతారా, లేదా?**

మానవ–జంతు సంఘర్షణ కేసుల్లో పరిహారం అంశంపై వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా సోమవారం లోక్‌సభలో ధ్వజమెత్తారు. ప్రశ్నోత్తరాల సమయంలో సప్లిమెంటరీని ప్రశ్ని వేసిన ఆమె మానవ–జంతు సంఘర్షణకు సంబంధించిన కేసులలో సాధారణ ప్రజలుష రైతులకు పరిహారం పెంచుతారా లేదా అని ప్రశ్నించారు. ఆదివారం తన నియోజకవర్గంలో ఓ వ్యక్తి ఏనుగు దాడికి గురయ్యాడని ఆమె పేర్కొన్నారు. అయితే పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్ స్పందిస్తూ ఇది సప్లిమెంటరీ ప్రశ్నకు సంబంధించిన కాదు అని అభ్యంతం వ్యక్తం చేశారు. అయితే కేరళ, కర్ణాటక, తమిళ నాడు సరిహద్దుల్లో ఉన్న వయనాడ్‌లో పరిపాలన, అటవీ శాఖ కలిసి పనిచేస్తున్నాయని వివరించారు. ఈ విషయంలో ప్రభుత్వం చేసిన పనుల కాపీని వయనాడ్ ఎంపికి షేర్ చేస్తామని చెప్పారు.

# 'పాలస్తీనా' బ్యాగ్‌తో పార్లమెంట్‌కు ప్రియాంక




**న్యూఢిల్లీ :** పాలస్తీనా ప్రజలకు మద్దతుగా కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా సోమవారం నాడు 'పాలస్తీనా' పేరు ముద్రించిన బ్యాగును వేసుకొని సోమవారం పార్లమెంటుకు వెళ్ళారు. గాజాలో ఇజ్రాయెల్ చర్యలకు వ్యతిరేకంగా,పాలస్తీనీయులకు ఆమె సంఘీభావం ప్రకటించారు. పాలస్తీనా అనే పేరు ,పాలస్తీనా చిహ్నాలు, పుచ్చకాయతో సహా చెక్కబడిన హ్యాండ్‌బ్యాగ్‌ను ప్రియాంక వేసుకున్నారు. ఈ హ్యాండ్‌బ్యాగ్‌ను ధరించి ఆమె ఏమి సందేశం పంపాలని భావిస్తున్నారని బిజెపి ఎంపి అనురాగ్ ఠాకూర్ ప్రశ్నించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దురాగతాలపై ప్రియంక ఒక్క మాట కూడా మాట్లాడలేదని,కానీ పాలస్తీనా బ్యాగుతో ఫ్యాషన్ స్టేట్‌మెంట్ ఇవ్వాలనుకుంటున్నారని ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీలు హిం దువులు, క్రైస్తవులపై జరుగుతున్న దారుణాల గురించి బిజెపి ప్రభుత్వం ఏదైనా చేయాలని, బంగ్లాదేశ్ ప్రభుత్వంతో మాట్లాడి ఈ దారుణాలను ఆపాలని ప్రియాంక ప్రతిస్పందించారు. న్యూఢిల్లీలోని పాలస్తీనా రాయబార కార్యాలయం ఛార్జ్ డి'అఫైర్స్ (బాధ్యులు) అబేద్ ఎల్రాజెగ్ అబు జాజర్ గత వారం కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానం నుండి ఇటీవల ఉప ఎన్నికల్లో విజయం సాధించిన ప్రియాంకగాంధీని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.జూన్‌లో ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహును , ఆయన ప్రభుత్వాన్ని ఆటవికమని ఆరోపిస్తూ, గాజాలో ఇజ్రాయెల్ ప్రభుత్వం సామూహిక హననం చేస్తుందని ప్రియాంక అన్నారు.

## అమర జవాన్లకు పలువురు నివాళి



**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సహా తదితరులు యుద్ధంలో అమరులైన జవాన్లకు నివాళులర్పించారు. ఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్ వద్ద రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞపకాలను గుర్తు చేసుకుంటూ నేతలు ఎక్స్ వేదికగా ట్వీట్లు చేశారు. డిసెంబరు 16వ తేదీ దేశ చరిత్రలో మర్చిపోలేని రోజు. 1971 యుద్ధంలో భారత్ – పాకిస్థాన్‌పై విజయం సాధించింది. సరిగ్గా 53 ఏళ్ల క్రితం పాకిస్థాన్ నడ్డివిరిచి పాక్ నుంచి బంగ్లాదేశ్ కు విముక్తి కల్పించడంలో భారత సైన్యం కీలక పాత్ర పోషించింది. 1971లో తూర్పు పాకిస్థాన్‌లో మొదలైన స్వాతంత్ర్య పోరు భారత్–పాక్ మధ్య యుద్ధానికి దారి తీసింది. భారత సైన్యం పాక్‌ను ఓడించి, బంగ్లాదేశ్ అవతరణకు కారణమైంది. ఆ విజయానికి గుర్తుగా భారత్ ఏటా డిసెంబర్ 16న 'విజయ్ దివస్' ను నిర్వహిస్తుంది. '1971 యుద్ధంలో అలుపెరగని ధైర్యాన్ని ప్రదర్శించి, భారతదేశానికి విజయాన్ని అందించిన మన వీర జవాన్లకు నివాళులర్పిస్తున్నాను. ఈ యుద్ధంలో ప్రాణ త్యాగం చేసిన జవాన్ల కథలు ప్రతి భారతీయుడికీ స్ఫూర్తినిస్తాయి' అని రాష్ట్రపతి ముర్ము అన్నారు. '1971లో భారతదేశ చారిత్రాత్మక విజయానికి దోహదపడిన వీర సైనికుల ధైర్యాన్ని, వారి త్యాగాలను మేము ఎప్పటికీ గౌరవిస్తాము. వారి నిస్వార్థ అంకితభావం, అచంచలమైన సంకల్పం మన దేశాన్ని రక్షించాయి. మనకు కీర్తిని తెచ్చాయి. వారి త్యాగాలు ఎప్పటికీ స్ఫూర్తినిస్తాయి' అని ప్రధాని మోదీ చెప్పారు. 'సాయుధ బలగాల ధైర్యసాహసాలు, త్యాగాలకు దేశం మొత్తం సెల్యూట్ చేస్తుంది. జవాన్ల త్యాగం, సేవను దేశం ఎన్నటికీ మర్చిపోదు' అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

# ట్రాక్టర్ల నిరసన ర్యాలీతో రైతుల సమరశంఖం


'బటోగే తో లుటోగే' (విడిపోతే లూఠీ అవుతాం) నినాదంతో ముందుకు సాగాలని ఎస్‌కెఎం నేత టికాయత్ పిలుపు



**కర్నల్ :** కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతుల ఆందోళన మరింత ఉధృత రూపం దాల్చుతోంది. మరోపక్క పంజాబ్ రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ డల్లేవాల్ ఆమరణ నిరాహారదీక్ష 21వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం)తనాయకుడు రాకేష్ టికాయత్ మంగళవారం రైతు సంఘాలు అన్నీ ఏకమై సంయుక్తంగా పోరాటం నిర్వహించాలని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా రాకేష్ టికాయత్ రైతు గ్రూప్‌లను ఉద్దేశించి 'బటోగే తో లుటోగే' (విడిపోతే లూఠీఅవుతాం) అనే నినాదాన్ని ఇచ్చారు. డల్లేవాల్ ఆరోగ్యం క్షీణించడం పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 70ఏళ్ల వయసున్న పంజాబ్ రైతునాయకుడు డల్లేవాల్ క్యాన్సర్ బారినపడ్డారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధరకు (ఎంఎస్‌పి) న్యాయ హామీ సహా పలు డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పంజాబ్, హర్యానా రాష్ట్రాల మధ్యనున్న ఖనౌరీ సరిహద్దు పాయింట్ వద్ద ఆమరణ నిరాహారదీక్ష కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. కాగా రైతుల నిరసనలకు మద్దతు తెలుపుతూ హర్యానాలోని అంబాలా సహా సోనిపట్, హిసార్ ప్రాంతాలలో రైతులు సోమవారం నాడు ఖనౌరీశంభు సరిహద్దు పాయింట్ల వద్ద ట్రాక్టర్ల ప్రదర్శన నిర్వహించారు. పంజాబ్‌కు చెందిన రైతు నాయకుడు సర్వాన్ సింగ్ పంధేర్ శనివారం నాడు మాట్లాడుతూ డిసెంబరు 16న పంజాబ్ మినహా అన్ని రాష్ట్రాలలో ట్రాక్టర్ల ర్యాలీని నిర్వహించాలని, పంజాబ్‌లో డిసెంబరు 18వ తేదీన మధ్యాహ్నం 12గంటల నుంచి 3గంటల వరకు 'రైల్ రోకో' నిర్వహించి నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పిలుపులో భాగంగానే సోమవారం నాడు రైతులు శంభుఖనౌరీ సరిహద్దు వద్ద ట్రాక్టర్లతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాగా ఇదే సమయంలో టికాయత్ ఖనౌరీ వద్ద ఆమరణ నిరాహారదీక్ష నిర్వహిస్తున్న డల్లేవాల్‌ను గత వారం కలుసుకున్నారు. ఇదిలాఉంటే సోమవారం రాకేష్ టికాయత్ విలేకరులతో మాట్లాడుతూ రైతుల గ్రూపులన్నీ డిమాండ్లకు మద్దతుగా సంఘటితంగా పోరాటం నిర్వహించాలని నొక్కిచెప్పారు. 'బటోగే తో లుటోగే, సబ్‌కో ఇక్కతే రెహ్నా పడేగా' అనే నినాదాన్ని ఇచ్చారు. పంధేర్ ఆదివారం నాడు మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చాకు రాసిన లేఖలో రైతుల పలు డిమాండ్లు పరిష్కారం కోసం పంజాబ్‌హర్యానా సరిహద్దు పాయింట్ల వద్ద నిరసన తెలుపుతున్న రైతులతో చేయి కలపాలని కోరినట్లు చెప్పారు. రైతుల పంటలకు ఎంఎస్‌పి సహా న్యాయహామీ ఇవ్వాలనే డిమాండ్ల పరిష్కారం కోసం మద్దతు పలకాలని విజ్ఞప్తి చేసినట్లు పంధేర్ చెప్పారు. శంభు సరిహద్దు వద్ద పంధేర్ ఆదివారం నాడు విలేకరులతో మాట్లాడుతూ 'ఢిల్లీ ఆందోళన్2లో భాగస్వాములు కానటువంటి సోదరులతో మా చేతులు కలిపి రైతుల ఆందోళనను మరింత ఉధృతం చేస్తాం. మా మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు ఉన్నా మర్చిపోయి రైతులు, కార్మికుల కోసం సంఘటితంగా పోరాడతాం' అని చెప్పారు. సంయుక్త కిసాన్ మోర్చా నుంచి మాకు సానుకూల మెస్సేజ్ వస్తుందని తాము ఆశిస్తున్నామని పంధేర్ విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. లేఖ గురించి అడగగా భారతీయ కిసాన్ యూనియన్ అధికార ప్రతినిధి అమిన టికాయత్ మాటద్లాడుతూ గత ఆరు నుంచి పదినెలల కాలంగా రైతు గ్రూప్‌ల నాయకులకు చెబుతూనే ఉన్నామని, రైతుల సమస్యల పరిష్కారం కోసం అందరూ సంఘటితమై కూర్చుని చర్చించాలని కోరామన్నారు. ఢిల్లీ చలో అనే పిలుపు వ్యక్తులకు సంబంధించిన సంస్థలు ఇచ్చినది అని, ప్రత్యేకించి పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల లో ఆశించిన ఫలితాలను సాధించలేకపోయారని, అందుకే అన్ని గ్రూపులకు చెందిన రైతు నాయకులం చేతులు కలిపి రైతుల పోరాటాన్ని వ్యూహాత్మకంగా ముందుకు తీసుకెళతామని ధీమా వ్యక్తం చేశారు. కాగా అంబాలానగరంలో రైతులు ట్రాక్టర్ల నిరసన ప్రదర్శన నిర్వహించిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. హిస్సార్, సమీప ప్రాంతాలకు చెందిన రైతులు రామాయణ్ టోల్‌ప్లాజా వద్దకు చేరుకుని అక్కడనుంచి ట్రాక్టర్లపై హన్సీకి నిరసన ప్రదర్శన నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎంనాన్ పొలిటికల్) కిసాన్ మజ్దూర్ మోర్చా(కెఎంఎం)ఇచ్చిన పిలుపులో భాగంగా రైతులు ట్రాక్టర్ల మార్చ్‌ను నిర్వహించారు.

## సిఎం కాగానే మాట ఎందుకు మారిందో..

**ఒమర్ అబ్దుల్లాపై కాంగ్రెస్ ఫైర్**



**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అగ్రనేత ఒమర్ అబ్దుల్లాపై కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో మండిపడింది. ఇవిఎంల విషయంలో తమ అభిప్రాయాన్ని తప్పుపడుతూ ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సిఎం పదవి దక్కగానే ఇవిఎంల విషయంలో ఒమర్ అబ్దుల్లా మాట ఎందుకు మారిందని కాంగ్రెస్ సీనియర్ నేత మాణిక్కం ఠాగూర్ ప్రశ్నించారు. ఇవిఎంలకు వ్యతిరేకంగా సమాజ్‌వాదీ పార్టీ, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, ఉద్ధవ్ ఠాక్రే వర్గం శివసేన పార్టీ బహిరంగంగా మాట్లాడాయని, తాము కాదని, ఒమర్ అబ్దుల్లా నిజాలు తెలుసుకుని మాట్లాడాలని మాణిక్కం ఠాగూర్ అన్నారు. తాము ఇవిఎంల పనితీరుపై అనుమానం వ్యక్తంచేస్తూ సిడబ్ల్యుసిలో చేసిన తీర్మానాన్ని కేవలం కేంద్ర ఎన్నికల సంఘానికి మాత్రమే ఇచ్చామని తెలిపారు. ప్రతిపక్ష కూట మిలో భాగస్వామి అయి ఉండి, సిఎం కాగానే ఒమర్ అబ్దుల్లా ఎందుకు మాట మార్చారో అని ఠాగూర్ వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఇటీవల మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీకి కనీసం 10 శాతం సీట్లు కూడా రాకపోవడంతో ఈవీఎంలపై మరోసారి విమర్శలు వెల్లువెత్తాయి.

## ఇవిఎంలకు వ్యతిరేకంగా
# ఎంవిఎ నిరసన ప్రదర్శన




**నాగ్‌పూర్ :** నాగ్‌పూర్‌లోని మహారాష్ట్ర విధాన్ భవన్ మెట్లపై ప్రతిపక్షాలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషన్ (ఇవిఎం)ల ఉపయోగానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నాగ్‌పూర్‌లో అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. కాగా, శాసనమండలిలో ప్రతిపక్షనేత అంబదాస్ దాన్వే నేతృత్వంలోని ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ (ఎంవిఎ) నేతలు నిరసన ప్రదర్శన నిర్వహించి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇవిఎంలు ఉపయోగించడాన్ని వ్యతిరేకించాలన్నారు. 'ఇవిఎం హటావో... దేశ్ బచావో', 'ఇవిఎం హటావో... కానిస్టిట్యూషన్ బచావో', 'ఇవిఎం హటావో... డెమాక్రసీ బచావో' అంటూ నినదించారు. దాన్వేతో పాటు నిరసన ప్రదర్శనలో కాంగ్రెస్ శాసనభ్యులు విజయ్ వడెట్టివార్, నితిన్ రౌత్, భాయి జగతప్, వికాస్ ఠాక్రే, శివసేన (యుబిటి) నేతలు భాస్కర్ జాధవ్, వరుణ్ దేశాయి, సచిన్ అహిర్, ఎన్‌సిపి (ఎస్‌పి) ఎంఎల్‌ఎ జితేంద్ర అహ్వాద్‌లు పాల్గొన్నారు. దాన్వే మీడియాతో మాట్లాడుతూ ఇవిఎంలు ప్రజాస్వామ్యానికి ముప్పు, ఎన్నికల్లో ఇవిఎంల ఉపయోగాన్ని ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఇవిఎంలను తొలగించాలని, బ్యాలట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని తాము కోరుతున్నామని శివసేన (యుబిటి) నేత పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, అదికార మహాయుతి ప్రభుత్వాన్ని ఇవిఎం సర్కార్‌గా ప్రతిపక్ష ఎంవిఎ పేర్కొనడాన్ని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఖండించారు. ప్రతీ ఓటు మహారాష్ట్రకే పడ డం వల్లే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ యన వ్యాఖ్యలపై దాన్వే స్పందిస్తూ ప్రతి ఓటు బ్యాలట్ పేపర్‌కే వేయాలన్నారు. కాంగ్రెస్ నేత భాయి జగతప్ మాట్లాడు తూ ఇవిఎంలో వేసిన ప్రతి ఓటు మహాయుతికి వెళ్లిందన్నారు. కేంద్ర ప్రభుత్వం, బిజెపి నేతృత్వంలోని మహారాష్ట్ర ప్రభుత్వం ఇవిఎంలను దుర్వినియోగపరిచాయని ఆరోపించారు. ఇవిఎంల ఉపయోగానికి బదులుగా బ్యాలట్ పేపర్ల ఉపయోగంపై కాంగ్రెస్, ఎంవిఎ అవగాహన కల్పిస్తుందన్నారు.

## హిందువులపై దాడులకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ



**కోల్‌కతా :** బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు, పొరుగు దేశంలో హిందూ సన్యాసి చిన్మోయ్ కృష్ణ దాస్‌ను నిర్బంధించడాన్ని నిరసిస్తూ 'బెంగాలీ హిందూ సురక్షా సమితి' ఆధ్వర్యంలో సోమవారం నగరం నడిబొడ్డున వందలాది మందితో ర్యాలీ నిర్వహించారు. గతంలో ఇస్కాన్ బంగ్లాదేశ్‌తో అనుబంధం ఉన్న దాస్‌ను విడుదల చేయాలని, ముహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం హిందువులు, ఇతర మైనారిటీలపై అఘాయిత్యాలను ఆపాలని డిమాండ్ చేస్తూ సీల్దా స్టేషన్ నుంచి రాణి రాష్మోని రోడ్డు వరకు రెండు కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించారు. హిందువులు, ప్రార్థనా స్థలాలను లక్ష్యంగా చేసుకుని కొనసాగుతున్న హింసాకాండపై నిరసనకారులు కాషాయ జెండాలు, బ్యానర్లను పట్టుకుని ఆందోళనలు చేశారు. హిందువుల భద్రత, రక్షణకు హామీ ఇచ్చేలా తాత్కాలిక ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఈ దాడులకు పాల్పడిన వారిని చట్టానికి తీసుకురావాలని డిమాండ్ చేశారు. దాస్ అరెస్టు అన్యాయమని, షేక్ హసీనా ప్రభుత్వం పతనం అయినప్పటి నుండి హిందువులు, ఇతర మైనారిటీలు, వారి ప్రార్థనా స్థలాలపై దాడులకు పాల్పడడమే అతను లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. మైనారిటీలు శాంతి, సామరస్య వాతావరణంలో జీవించేలా బంగ్లాదేశ్‌లో తా త్కాలిక ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 'బంగ్లాదేశ్ హిందూ దేర్ ఓపోర్ అక్రోమో న్ బంధో కరో,' (మైనారిటీ హిందువులపై దాడు లు ఆపండి), 'చిన్మోయ్ కృష్ణ దాసర్ ఒబిలోంబే ముక్తి చాయ్' (చిన్మోయ్ దాస్‌ను వెంటనే విడుదల చేయాలి) అని రాసి ఉన్న ప్లకార్డులను పట్టుకుని నిరసనకారులు పెద్ద ఎత్తున ర్యాలీ తీశారు.

**IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT BHUPALPALLY**

**E.P.No. of 2024**

**In**

**O.S.No.188 of 2022**

**(Old O.S.No.69 of 2015)**

Between:

**Gaddam Yadagiri, S/o: Sri Pochaiah,** Age: 55 years, Occ: Singareni Employee, R/o: Q.No.T2-589, Krishna Colony, Bhupalpally, Jayashankar Bhupalpally District

**...Petitioner / Decree Holder**

And

1. **Kampa Mogili,** S/o. Sri Kanukaiah, Age:61 years, Occ: Singareni Employee, R/o: Q.No.T2-947, Krishna Colony, Bhupalpally, Jayashankar Bhupalpally District.
2. **Singareni Collieries,** rep. by its General Manager, Bhupalpally, Jayashankar Bhupalpally District.

**...Respondents / Judgment Debtor**

**NOTICE**

Please take notice that the above petitioner/ decree holder filed the E.P. against the Respondents to direct the Respondent No.2 to deposit the withheld amount of I.A.No.173 OF 2020 in 0.S.No.69 OF 2015 (Old) / O.S.No.188 OF 2022 (New), if the Respondent No.1 /Judgement Debtor No.1 having any objection may file his objections before the above mentioned Hon'ble Court on **03-01-2025 at 10-30 A.M.** either personally or through an advocate with due objections. If nobody appears before the Hon'ble Court on the said date, the matter will be heard and decided on merits.

// By Order of the Hon'ble Court//

**Sd/- PAGADALA ANANDA RAO**
**ADVOCATE**
Bhupalpally,
Jayashankar Bhupalpally District.

